నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రవీణ్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని లక్ష్మీగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లక్ష్మీగూడ గ్రామం, హౌసింగ్ బోర్డు కాలనీ, బాలాజీనగర్, షమా టెంట్ హౌస్, గణేష్‌నగర్, టీఎన్‌జీవోస్ కాలనీ, అమ్మ గార్డెన్, పయనీర్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో...

మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సెక్షన్ పరిధిలోని బండ్లగూడ విద్యుత్ ఫీడర్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వినాయకనగర్, ఆలీనగర్, అయేషాకాలనీ, కింగ్స్ ఎవెన్యూ, యూసఫ్ గుల్షన్ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి గ్రామం విద్యుత్ ఫీడర్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొగల్స్ కాలనీ, ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీ, పల్లె చెరువు విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఆలీనగర్, తమిళ్ బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

గచ్చిబౌలి: సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అధికారులకు సూచించారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీవాసులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షుడు వీరేశంగౌడ్, నాయకులు రవీందర్‌గౌడ్, జగన్మోహన్‌రెడ్డి, క్రాంతికిరణ్, నాగరాజు, నర్సింగ్‌రావు, మోహన్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

'ఆల్ ప్రజెంట్' చిత్ర ప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శుక్రవారం ఆల్ ప్రజెంట్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనలో కళాకారుడు రాయ్‌వర్గీస్ వేసిన 20 చిత్రాలను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. ఈనెల 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సందర్శకులకు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

26న కృత్రిమ అవయవాల పంపిణీ

జియాగూడ: లయన్స్ ఇంటర్నేషనల్ తెలంగాణ అమెరికా తెలుగు సంఘం వారి సహకారంతో ఈ నెల 26న ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు ఉచితంగా కృత్రికమ అవయవాల పంపిణీ కోసం స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు గ్రేటర్ క్లబ్ అధ్యక్షుడు లయన్ లింగయ్య పూస, ప్రోగ్రాం డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ లయన రవీందర్‌రావు బాచుపల్లి, జాయింట్ కో ఆర్డినేటర్ పరమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం హయత్‌నగర్ పొద్దార్ ఇంటర్నేషనల్ స్కూల్ ఉంటుందన్నారు.

కారులో చెలరేగిన మంటలు



మైలార్‌దేవ్‌పల్లి: కారులో చెలరేగిన మంటల కారణంగా పూర్తిగా కాలిపోయిన ఘటన శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం..పటాన్‌చెరువుకు చెందిన శ్రావణ్ కారును తీసుకొని చాంద్రాయణగుట్ట నుంచి దుర్గానగర్ మీదుగా ప్రయాణిస్తున్నాడు. కారు ముందు భాగం నుంచి ఒక్కసారిగా పొగలు, మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమై కారును రోడ్డు పక్కన ఆపి మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. కానీ అవి ఆగకుండా కారు ముందు భాగం మొత్తం కాలిపోయింది. ప్రమాదం కారణంగా ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లీయర్ చేయించారు.

'బీసీ బంద్'ను విజయవంతం చేద్దాం

బండ్లగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండా అడ్డుకుంటున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వ ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. బీసీ బంద్‌ను విజయవంతం చేద్దామని ఆయన పిలుపనిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఉదయం 8 గంటలకు బీసీ బంద్ కార్యక్రమం ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూన్నామన్నారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వేముల రామకృష్ణ

నేటి బంద్‌కు బస్సులు నడపవద్దు: వేముల రామకృష్ణ..

రాజేంద్రనగర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై బీసీ జేఏసీ ఇచ్చిన బంద్‌కు బస్సులను నడపకుండా సహకరించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాజేంద్రనగర్ డిపో మేనేజర్‌కు ఆయన కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 18న బంద్‌కు ఆర్టీసీ బస్సులను నడపకూడదని.. బంద్‌కు పూర్తిగా సహకరించాలని సూచించారు. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయన్నారు.

బంద్‌కు సంపూర్ణ మద్దతు

అత్తాపూర్: బీసీ సంఘాలు ఇచ్చిన బంద్‌కు ప్రజలంతా స్వచ్ఛందంగా మద్దతు తెలపాలని అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ బంద్ నిర్వహిస్తున్న బీసీ సంఘాలకు బీజేపీ తరఫున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. అదే విధంగా బంద్ సందర్భంగా బస్ డిపోలు, విద్యా సంస్థలు, వాణిజ్యస్తులు అన్ని స్వచ్ఛందంగా బంద్ చేయాలని పిలుపునిచ్చారు. బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేస్తుందని ఆయన అన్నారు.

సీజేఐపై దాడిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

శంషాబాద్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిని అరెస్ట్ చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతిపత్రం సమర్పించారు. దళితుడై గవాయ్ అత్యున్నత పదవి అధిరోహించడంలో దేశంలోని కొన్ని శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై తక్షణమే కేసు నమోదు చేయాలన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు రమేష్‌మాదిగ, మంగళారంరత్నం, భాస్కర్, నిఖిల్, జ్యోతి ఉన్నారు.



రాజేంద్రనగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తహసీల్దార్‌కు వినతిపత్రం..

రాజేంద్రనగర్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు శుక్రవారం రాజేంద్రనగర్ తహసీల్దార్‌కు నాయకుల బృందం వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావు మాదిగ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడి భారత రాజ్యాంగం మీద జరిగిన దాడిగా మేము భావిస్తున్నామన్నారు. పోతురాజు యాదయ్య మాదిగ, నాన్నగారి రాంచందర్ మాదిగ, లింగని కృష్ణమాదిగ, శ్యామల జగదీశ్వర్, జీవన్‌దాస్, శ్రీనివాస్, శ్యామల గంగాధర్, రాజుకుమార్, సూర్యం పాల్గొన్నారు.

స్వతంత్ర దర్యాప్తు కమిటీని వేయాలి..

మణికొండ: దేశ అత్యున్నత న్యాయమూర్తిపై దాడి వెనకాల ఉన్న శక్తులను గుర్తించేందుకు స్వతంత్ర దర్యాప్తు కమిటీని వేయాలని ఎంఆర్‌పీఎస్ గండిపేట మండల ఇన్‌చార్జి గణేష్‌మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం నాయకులతో కలిసి గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు పెద్దపులి శంకర్, దేవేందర్ మాదిగి, రంజిత్‌మాదిగ, శంకర్‌మాదిగ, నరేష్ మాదిగ, రవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



దుర్గామాతకు పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభిస్తున్న కార్తీక్‌రెడ్డి

మణికొండ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి అన్నారు. శుక్రవారం మణికొండ భాగ్యలక్ష్మి కాలనీ దుర్గామాత ఆలయంలో పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పక్కనే ఉన్న షేక్‌పేట డివిజన్ పరిధిలోని ఓయూ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు గత పదేళ్ల బీఆర్ఎస్ అభివృద్ధి, సంక్షేమ పాలనను, ఈ రెండేళ్ల కాంగ్రెస్ ప్రజావంచన పాలనను బేరీజు వేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీల పార్టీ అధ్యక్షుడు సీతారాం, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగరాజుల, నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సస్య రక్షణలో చీడపీడల నివారణ కీలక అంశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని భారత ఆహార ధాన్యాల నిల్వ, నిర్వహణ, పరిశోధన సంస్థ ఆడిటోరియంలో కేంద్రీయ సమగ్ర సస్య సంరక్షణ కేంద్రం, జీడిమెట్ల, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి ప్రారంభమైన ఐదు రోజుల 'సమగ్ర సస్య రక్షణ–మానవ వనరుల అభివృద్ధి'కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొక్కల చీడ పీడల నిర్వహణలో ఐపీఎం ప్రాముఖ్యతను, రసాయన పురుగుల మందు సురక్షితమైన, వివేకవంతమైన ఉపయోగాన్ని ఆయన నొక్కి చెప్పారు. వ్యవసాయ అధికారులు అందరూ తమ సాధారణ కార్యకలాపాలతో పాటు చీడ పీడల పర్యవేక్షణ, పర్యావరణ అనుకూల చీడ పీడల నిర్వహణ విధానాలపై దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణ వ్యవసాయ శాఖ అధికారులు, తెలంగాణ రైతులు జాతీయ చీడ పీడల పర్యవేక్షణ వ్యవస్థ (ఎన్‌పీఎస్ఎస్) మొబైల్ యాప్‌ను ప్రోత్సహిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. సీఐపీఎంసీ హైదరాబాద్ ఇన్‌చార్జి అధికారిణి రౌతు సునీత మాట్లాడుతూ..ఐపీఎం పద్ధతులు, విధానాలను తుది వినియోగదారులైన రైతులకు అమలు చేయాలని కోరారు. సీఐపీఎంసీ హైదరాబాద్ శిక్షణ సమన్వయకర్త వెంకటరెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పాల్గొన్న వారందరూ నేర్చుకున్న ఐపీఎం విధానాలు, వ్యవసాయ సమాజానికి ప్రయోజనకరంగా ఉంటాయని ఆశించారు. ఐజీఎంఆర్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్ గౌడ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గోపి

ఎర్రచెరువును పరిశీలించిన రెవెన్యూ అధికారులు

శంషాబాద్: సంఘిగూడ ఎర్ర చెరువు వరద కాల్వలను దారి మళ్లించిన విషయమైన రైతు పాపారాయుడు చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలన చేపట్టారు. కొందరు వ్యక్తులు ఈ నెల 9న వరద కాల్వలను దారి మళ్లించడంతో పాపారాయుడు పొలంలోకి వరద చేరడంతో పాటు పీవన్ రోడ్డుపై వరద నీరు ప్రవహించడంతో ప్రయాణికులు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై రైతు తహసీల్దార్ రవీందర్ దత్‌తో పాటు జిల్లా కలెక్టర్, హైడ్రాకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చెరువు స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య త్వరలో ఇరిగేషన్ అధికారులతో కలిసి సంయుక్తంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఐటీఐలతో సీబీఐటీ ఒప్పందం

మణికొండ: నైపుణ్యాలు, ఆవిష్కరణ, వ్యాపారశీలత మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే దిశగా చైతన్యభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలోని అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్(ఏసీఐసీ) మల్లేపల్లి, ఖైరతాబాద్, సనత్‌నగర్ ఐటీఐలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శుక్రవారం ఆయా సంస్థలతో ఒప్పంద పత్రాలను మార్చుకున్నట్లు యాజమాన్యం తెలిపింది. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తూ, ఐటీఐ విద్యార్థుల్లో డిజైన్ థికింగ్, ఆవిష్కరణ, స్టార్టప్, సాంస్కృతిక విలువలను ప్రోత్సహించేందుకు ఇది దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో సీబీఐటీ ఏసీఐసీ సీఈఓ డాక్టర్ సన్నీ అగర్వాల్, ఐటీఐ ప్రిన్సిపాల్‌లు దోవ శైలజ, పి. శ్రీనివాస్‌రావు, వేమారెడ్డి,, ఆర్. శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

'సీపీఆర్'పై విద్యార్థులకు అవగాహన

రాయదుర్గం: గుండె కొట్టుకోవడం ఆగిపోయినా లేదా సాధారణంగా శ్వాస తీసుకోని వ్యక్తికి అత్యవసర చికిత్స 'సీపీఆర్ (కార్డియోపల్మోనరీ రిససిటేషన్)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు తాజ్‌బాబు ఆధ్వర్యంలో 108 సిబ్బంది డెమో ద్వారా విద్యార్థులకు సీపీఆర్ ఎలా చేయాలో చూపించడంతో బాటు వారి చేత చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

ధంతేరాస్..మార్కెట్ జోష్

జియాగూడ: దీపావళి పండుగలో భాగంగా శనివారం ధంతేరాస్ దీవస్ పూజలు ఉండడంతో పలు ప్రాంతాలు రద్దీగా మారాయి. గృహ అలంకరణ వస్తువులు, పూజా సామాగ్రి, దీపంతల విద్యుత్ లైట్స్ తదితర కొనుగోళ్లతో బేగంబజార్ మార్కెట్లు కిటకిటలాడాయి. దీంతో బేగంబజార్‌లోని ఛత్రి, ఫీల్‌ఖానా, భర్తన్‌బజార్, సిద్దిఅంబర్‌బజార్, ఉస్మానియా తదితర ప్రాంతాలు రద్దీగా మారాయి. ధంతేరాస్ దీవస్‌కు బంగారం ధరలు ఆకాశాన్నంటాయి. బంగారం 10 గ్రాములు రూ.1,34,990 లక్షలకు చేరింది. అయినప్పటికీ సిద్దిఅంబర్ బజార్ చౌరస్తాలో బంగారం కొనేందుకు బారులు తీరారు. అలాగే వెండి ధర కేజీ.రూ.1,90,000 లక్షలు పలుకుతుంది.



ఇంటి అలంకరణ వస్తువులు



ప్లాస్టిక్ విద్యుత్ దీపాలు



సిద్దిఅంబర్‌బజార్ చౌరస్తా రద్దీ



బంగారం కొనేందుకు బారులు తీరిన జనం



భారీ బందోబస్తు మధ్య సర్వే చేస్తున్న అధికారులు

ఆలయం వద్ద సర్వే వివాదం

మణికొండ: తమ పట్టా భూములు తమకు సర్వే చేసి ఇవ్వాలని ఓ యజమాని పెట్టుకున్న అర్జీ ప్రకారం సర్వే చేసేందుకు వెళ్లిన అధికారులను పక్కనే ఉన్న ఆలయ కమిటీ నాయకులు అడ్డుకున్నారు. గండిపేట మండలం, పుప్పాలగూడ రెవెన్యూ సర్వే నెంబర్ 376లో పలువురికి పట్టా భూములు ఉన్నాయి. వాటిని సర్వే చేసి హద్దులు నిర్ణయించి ఇవ్వాలని వారు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో శుక్రవారం మండల సర్వేయర్ సతీష్, నార్సింగి పోలీసుల భారీ బందోబస్తు మధ్య సర్వే నిర్వహించేందుకు వెళ్లారు. పక్కనే ఉన్న సంకట హర హనుమాన్ ఆలయ ఆవరణలో సర్వే నిర్వహిస్తుండటంతో ఆలయ కమిటీ, బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాదనలు కొనసాగాయి. వారికి సర్ది చెప్పి నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సదరు సర్వేను పూర్తి చేయించారు. పక్కనే మరిన్ని సర్వే నెంబర్‌ల హద్దులు నిర్ణయించాల్సి ఉందని, ఆలయం పట్టా భూమిలో ఉందని, ఆలయ కమిటీ వారు పట్టాదార్లతో మాట్లాడి దేవాలయానికి భూమి తీసుకుంటే సమస్య సద్దు మనుగుతుందని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

రాజేంద్రనగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ నామినేషన్ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ ర్యాలీకి రాజేంద్రనగర్ యూత్ కాంగ్రెస్ నాయకులు శిరీష్, అబ్దుల్ హమీద్, రాజేందర్ రావు, హరీష్, రాహుల్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా నవీన్‌యాదవ్‌ను వారు గజమాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా తాము కూడా ప్రచారం చేస్తామని చెప్పారు.



నామినేషన్ ర్యాలీలో నవీన్‌యాదవ్‌ను గజమాలతో సత్కరిస్తున్న శిరీష్, అబ్దుల్ హమీద్

మౌలిక వసతుల కల్పనకు కృషి



కార్తీక్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్: ట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి తెలిపారు. ముచ్చింతల్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు సరిపడ తరగతి గదులు, మరుగుదొడ్లు లేవని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా మూత్రశాలల ఏర్పాటు చేస్తామని కార్తీక్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు బి.శంకర్, సొసైటీ డైరెక్టర్ జె.రాఘవేందర్, నాయకులు సురేందర్‌రెడ్డి, వెంకటేష్, శేఖర్, పట్టాబి, సామెల్, చంద్రబాబు పాల్గొన్నారు.

కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలి



సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సభ్యుడు, నాయకులు

మణికొండ: గ్రామ స్థాయి నుంచి దేశస్థాయి వరకు పార్టీ నిర్మాణం పారదర్శకంగా జరగడంతో పాటు కార్యకర్తలు, నాయకులంతా కలసికట్టుగా పనిచేయాలని పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడి ఎన్నికలు నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సభ్యుడు, కేరళ ఎంపీ రాబర్ట్ బ్రూస్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని పీఎస్ఆర్ గార్డన్స్‌లో శుక్రవారం జిల్లా పార్టీ అధ్యక్షుడి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్టీ నిర్మాణాన్ని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేయడం, పార్టీ కోసం నిరంతరం కష్టపడే వారికే పదవులను ఇవ్వాలనే ఆలోచనతో నాయకత్వాన్ని ఎన్నుకుంటున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవాలన్నారు. జిల్లా అధ్యక్ష స్థానానికి 16 మంది పోటీలో ఉండగా వారికి నచ్చిన వారికి ఓటు వేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినయ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీల అధ్యక్షులు అశోక్‌యాదవ్, కృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, వైస్ చైర్మన్ కె.దశరథయాదవ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలోని మసీదుబండ కేఎంఆర్ ఎస్టేట్ కాలనీలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎంఆర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాలనీలో ఔట్ లెట్ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. అవసరమున్న చోట మ్యాన్‌హోల్స్ పునరుద్ధరించాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.



కేఎంఆర్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మహాపాదయాత్ర ప్రారంభం

రాయదుర్గం: శబరిమల మహాపాదయాత్ర ప్రారంభమైంది. గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు రంగనాథస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. కార్పొరేటర్ ఉప్పలపాటిశ్రీకాంత్, రఘునాథ్‌రెడ్డి నాయకులు శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు,శ్రీరామ్‌నాయక్, అయ్యప్పభక్తులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పనివేళలు మార్చాలి

సుల్తాన్‌బజార్: జీహెచ్ఎంసీ విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పనివేళలు తెల్లవారుజామున 5 గంటలకు కాకుండా 6 నుంచి 7 గంటల మధ్య కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఉదారి గోపాల్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రెటరి సంజు ఎల్బీనగర్‌జోన్ అధ్యక్షుడు హన్మంతు కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కేశవ పాటిల్‌ను కలిసి ఉద్యోగుల తరపున వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..విధి నిర్వహణలో ఎస్ఎఫ్ఏ చనిపోతే అతని స్థానంలో నిబంధనల ప్రకారం అతని భార్యకు ఉన్న విద్యార్హతను బట్టి ఉద్యోగం ఇవ్వాలని కానీ ఆమెకు స్వీపర్ ఉద్యోగం ఇవ్వడం అత్యంత బాధాకరమన్నారు. ఈ విషయంపై దృష్టి సారించాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.



జెడ్‌సీకు వినతిపత్రం అందజేస్తున్న గోపాల్ తదితరులు